సాక్షి
విశాఖపట్నం
సోమవారం । 6 । మే । 2024



'నీట్'గా పరీక్ష 8లో



వెస్ట్.. బెస్ట్ 10లో



శారదా పీఠంలో ముగిసిన మహాక్రతువు 8లో

• ఆపత్కాలంలో ఆపన్నహస్తం

కన్నీటి సుడులు.. కరిగె సూరీడు



- ఎల్‌జీ పాలిమర్స్, హార్బర్ ప్రమాద సమయాల్లో అండగా ప్రభుత్వం
- యుద్ధప్రాతిపదికన సహాయ చర్యలు.. 48 గంటల్లోనే బాధితులకు పరిహారం
- మనసున్న ముఖ్యమంత్రిగా వై.ఎస్.జగన్‌కు జన నీరాజనాలు
- టీడీపీ హయాంలో సహాయం కోసం ఏళ్ల తరబడి ఎదురుచూపులు
- హుద్‌హుద్ బాధితులకు పరిహారం అందించని చంద్రబాబు

విశాఖ సిటీ : చంద్రబాబుకు అరచేతిలో వైకుంఠం చూపించడంలో 40 ఏళ్లకు పైగా అనుభవం ఉంది. ఏ సంఘటనైనా, ప్రమాదమైనా తన రాజకీయ లబ్ధికి వినియోగించుకుంటే.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రమాద బాధితులకు సత్వర సాయం అందించాలని పరితపించారు. టీడీపీ హయాంలో సంభవించిన విపత్కర పరిస్థితుల్లో హడావుడి, ప్రచార ఆర్భాటాలకే పరిమితమైతే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలపై దృష్టి సారించింది. అప్పట్లో నష్టపరిహారం కోసం బాధితులు ఏళ్ల తరబడి వేచి చూడాల్సి రాగా.. ఈ ప్రభుత్వం ప్రమాదం జరిగిన గంటల్లోనే బాధితుల బ్యాంకు **ఖాతాల్లో పరిహారం జమచేసింది. ఒకవైపు సంక్షేమం, అభివృద్ధితో పాటు ప్రమాద సమయాల్లో గత, ప్రస్తుత ప్రభుత్వాలు స్పందించి సహాయం అందించిన తీరుపై ఓటర్ల మధ్య ఆసక్తికర చర్చ జరుగుతోంది. ముఖ్యంగా అప్పట్లో హుద్‌హుద్ తుపాను సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీలు గాలికి కొట్టుకుపోయాయి. ఈ** ఐదేళ్లలో ఎల్‌జీ పాలిమర్స్, హార్బర్ ఘటనల్లోను, అలాగే వరదలతో పోలవరం బ్యాక్ వాటర్ కారణంగా అల్లూరి జిల్లాలో నాలుగు మండలాలు నీట మునిగిన సమయంలో ప్రభుత్వం కేవలం 72 గంటల్లోనే బాధితులకు నష్ట పరిహారం అందించిన విషయాన్ని గుర్తు చేసుకుంటున్నారు.



ఎల్‌జీ పాలిమర్స్ బాధితులకు సీఎం జగన్ పరామర్శ(ఫైల్)

ఎల్‌జీ బాధితులకు అండగా..

2020, మే 7వ తేదీన జరిగిన ఎల్‌జీ పాలి**మర్స్ ప్రమాదంలో** 12 మంది మృత్యువాతపడ్డారు. **అనేక మంది అ**నారోగ్యం బారిన పడ్డారు. దీంతో **ప్రభుత్వం యుద్ధ** ప్రాతిపదికన ఆ పరిశ్రమ చుట్టు **పక్కల గ్రామాల**ను తరలించింది. వారందరికీ వారం రోజుల పాటు ప్రత్యేక వసతి సౌకర్యాలు కల్పించింది. అలాగే మృతుల కుటుంబాలకు రూ.కోటి, ఆస్పత్రిలో చికిత్స పొందిన వారికి రూ.10 లక్షలు, ఆ ప్రాంతంలో ఉన్న ఒక్కరికీ రూ.10 వేలు చొప్పున నష్టపరిహారం కేవలం మూడు నుంచి వారం రోజుల్లోనే అందించింది. అంత భారీ స్థాయిలో పరిహారం సీఎం జగన్ ప్రకటించడంతో ప్రతిపక్షాల సైతం నోరెళ్లబెట్టాయి.

గవర సామాజికవర్గానికి ప్రాధాన్యం



మాట్లాడుతున్న ఎంపీ వైవీ సుబ్బారెడ్డి

గాజువాక : సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా భావిస్తున్న వైఎస్సార్ సీపీకి ఈ ఎన్నికల్లో కూడా గవర సామాజికవర్గం అండగా నిలవాలని ఆ పార్టీ రీజినల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వై.వి. సుబ్బారెడ్డి కోరారు. విశాఖ పశ్చిమ గవర సామాజికవర్గ సభ్యులతో స్థానిక టీఎన్నార్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన ఆత్మీయ సభలో ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లలో సాగించిన సంక్షేమ పథకాలను ప్రజలకు మరింత మెరుగ్గా అందించడం కోసం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వైఎస్సార్‌సీపీకి గవర సామాజికవర్గం అండగా నిలవాలని, వారికి రాజకీయ ప్రాధాన్యత కలిస్తామని అన్నారు. గవర సామాజికవర్గానికి స్థలం కేటాయించాలని సంఘం పెద్దలు కోరారని, అధికారంలోకి వచ్చిన అనంతరం దీనిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విశాఖ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్‌ను ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఆడారి ఆనంద్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీకి అండగా ఉంటే గవర సామాజికవర్గానికి రాజకీయ ప్రాధాన్యత కల్పించే బాధ్యతను తాను తీసుకుంటానని అన్నారు. గవర సామాజిక వర్గ బలం, సమస్యలు తనకు పూర్తిగా తెలుసునని, వాటిని పరిష్కరించేందుకు ఎప్పుడూ సిద్ధంగా ఉంటానని చెప్పారు. ఏ సమస్య వచ్చినా తన వద్దకు రావచ్చని, తన తలుపులు ఎల్లప్పుడూ తెరిచే ఉంటాయని, వచ్చినవారి గౌరవం తగ్గకుండా చూసుకొనే బాధ్యతను తీసుకుంటానని అన్నారు. కార్యక్రమంలో గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మళ్ల విజయప్రసాద్, ఎస్.ఎ.రెహ్మాన్ తదితరులు పాల్గొన్నారు.



ఫిషింగ్ హార్బర్ బాధితులకు చెక్కు అందజేస్తూ..(ఫైల్)

కార్మికులకు తక్షణ పరిహారం

పరవాడ ఫార్మాసిటీలో 2022 డిసెంబర్‌లో లారస్ ఫార్మా కంపెనీలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో నలుగురు చనిపోవడంతో ప్రభుత్వం తక్షణమే స్పందించి, యాజమాన్యంతో మాట్లాడింది. ఇద్దరు రెగ్యులర్ కార్మికులకు రూ.75 లక్షల వంతున, ఇద్దరు కాంట్రాక్ట్ కార్మికులకు రూ.42 లక్షల వంతున సాయం అందించారు. ఫార్మా కంపెనీలో కార్మికులకు భద్రత కల్పించడం, కార్మికులకు భరోసా ఇవ్వడం ఈ ప్రభుత్వ హయాంలోనే జరిగిందని కార్మిక కుటుంబాలు కృతజ్ఞత తెలిపాయి.

ఊహించని పరిహారం



ఎల్‌జీ పాలిమర్స్ ప్రమాదం అత్యంత బాధాకరం. మా ప్రాణాలు పోతాయనుకున్నాం. ఈ సమయంలో ప్రభుత్వం సత్వరమే స్పందించి సహాయక చర్యలు చేపట్టింది. వేలాది మందికి వసతి సౌకర్యాలు కల్పించింది. ఒకవైపు అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరిన వారికి మెరుగైన వైద్యం అందిస్తూనే.. మరోవైపు పునరావాస కేంద్రాల్లో వారం రోజుల పాటు భోజన వసతి ఏర్పాటు చేసింది. బాధిత కుటుంబాలన్నింటికీ ఊహించని విధంగా నష్టపరిహారం అందించింది.

– ఎస్.మారయ్య, పద్మనాభనగర్

హార్బర్ ప్రమాదంలో మూడో రోజే పరిహారం

2023, నవంబర్ 19న ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో 49 బోట్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదాన్ని కూడా చంద్రబాబు రాజకీయ లబ్ధికి వినియోగించుకోవాలని ప్రయత్నించింది. మత్స్యకారులను ప్రభుత్వంపై రెచ్చగొట్టేందుకు విశ్వ ప్రయత్నాలు చేసింది. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం మాత్రం చంద్రబాబు, ఇతర పార్టీలకు ఆ అవకాశం ఇవ్వలేదు. ఎప్పటిలాగే ప్రమాదం జరిగిన మూడో రోజే నష్టపోయిన బోటు యజమానులకు రూ.7.11 కోట్లు అందజేసింది. అలాగే బోట్లపై ఆధారపడి జీవనోపాధి కోల్పోయిన 400 మంది కలాసీలకు రూ.10 వేలు చొప్పున ఆర్థిక సాయం అందించింది.

మనసున్న ముఖ్యమంత్రి జగన్

ప్రమాద, విపత్కర పరిస్థితుల్లోను చేతికి ఎముక లేదు అన్న చందంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బాధితులకు సహాయం అందిస్తూ వస్తున్నారు. చంద్రబాబులా ప్రమాదాలలో రాజకీయ లబ్ధి కోసం పాకులాడకుండా.. బాధితులను ఆదుకోవడమే ప్రథమ కర్తవ్యంగా భావించారు. ప్రమాదం జరిగిన వెంటనే ఆయా ప్రాంతానికి వెళ్లి హడావుడి, ప్రచార ఆర్భాటాలు చేయకుండా యుద్ధ ప్రతిపాదికన సహాయక చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేస్తూ.. బాధితులకు పరిహారం కూడా రెండు, మూడు రోజుల్లోనే అందించారు. ఆ తరువాతే సీఎం జగన్ బాధితులను పరామర్శిస్తూ వారికి పరిహారం అందిందా? లేదా? అని మరోసారి వాకబు చేస్తూ మనసున్న ముఖ్యమంత్రిగా నిరూపించుకున్నారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ అప్పటి టీడీపీకి.. ఇప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో జరిగిన మేలుపై ప్రజలు చర్చించుకుంటున్నారు.

రాజకీయ లబ్ధికే చంద్రబాబు ఆరాటం

టీడీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన ప్రతి ప్రమాదాన్ని చంద్రబాబు తమ రాజకీయ లబ్ధి కోసమే ఉపయోగించుకున్నారు. ప్రమాదం జరిగిన ప్రాంతానికి వెళ్లి తిష్టవేయడం.. మూడు, నాలుగు రోజులు దగ్గరుండి పనిచేస్తున్నట్లు హడావుడి, ప్రచార ఆర్భాటలు చేయడం.. అనుకూల మీడియాలో బాకాలు ఊదించుకోవడం.. బాధితులకు నష్టపరిహారం అందించేస్తామని చెప్పి వెళ్లిపోవడం.. ఇదీ ప్రతి ప్రమాద సమయంలోను జరిగిన తంతు. కానీ నెలలు, ఏళ్లు గడిచినా ఆ పరిహారం బాధితులకు అందించిన దాఖలాలు లేవు. అందుకు విశాఖలో హుద్‌హుద్ తుపాను ఘటనే నిదర్శనం. 2014, అక్టోబర్ 12వ తేదీన విశాఖను హుద్‌హుద్ తుపాను అతలాకుతలం చేసింది. రూ.వందల కోట్ల ఆస్తి నష్టం సంభవించింది. చంద్రబాబు విశాఖకు వచ్చి వారం రోజుల పాటు కలెక్టరేట్‌లో సమీక్షా సమావేశాలతో కాలయాపన చేశారు. రోజంతా సమీక్షలు చేయడంతో సహాయక చర్యలు ఆలస్యమయ్యాయి. అలాగే దేశ, విదేశాల నుంచే కాకుండా కార్పొరేట్, ప్రైవేటు దాతల నుంచి రూ.వందల కోట్ల విరాళాలు వచ్చాయి. వాటితో మత్స్యకారుల కోసం ప్రత్యేక కాలనీలు నిర్మిస్తానని, నష్టపోయిన ప్రతి ఒక్కరికీ ఆర్థిక సాయం అందిస్తానని చెప్పి వెళ్లిపోయారు. కేవలం రెండు చోట్ల గ్రూప్ హౌసింగ్ నిర్మాణాలు చేసి చేతులు దులిపేసుకున్నారు. తరువాత వారికి ఎటువంటి పరిహారం అందించలేదు. అనేక మంది పరిహారం కోసం అధికారుల చుట్టూ తిరిగినా పైసా కూడా విదిల్చలేదు.



గోదావరి వరదల సమయంలోను..

భారీ వర్షాలు కారణంగా గోదావరి పోటెత్తింది. అల్లూరి సీతారామరాజు జిల్లాలో చింతూరు, కూనవరం, వీఆర్‌పురం, ఎటపాక మండలాలు నీట మునిగాయి. కొన్ని ఇళ్లు పూర్తిగాను, మరికొన్ని పాక్షికంగా దెబ్బతిన్నాయి. దీంతో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని అధికార యంత్రాంగానికి ఆదేశాలు జారీ చేశారు. తాను పర్యటనకు వచ్చేలోగా సహాయక చర్యలతో పాటు బాధిత కుటుంబాలకు నష్టపరిహారం అందించాలని చెప్పారు. దీంతో పాక్షికంగా దెబ్బతిన్న సుమారు 20 వేల ఇళ్లకు రూ.2 వేలు చొప్పున మూడు రోజుల్లోనే పరిహారం అందించారు. నాలుగో రోజు సీఎం చింతూరులో పర్యటించిన నేపథ్యంలో ప్రతి ఒక్కరికీ పరిహారం అందిందని జగన్‌ను పొగడ్తలతో ముంచెత్తారు.

దేవుడిలా ఆదుకున్నారు



అగ్ని ప్రమాదం కారణంగా నా బోటు దగ్ధమైంది. జీవనోపాధి దూరమై కుటుంబం రోడ్డు మీద పడిపోయిందని భయపడ్డాను. కానీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దేవుడిలా ఆదుకున్నారు. నష్టపోయిన బోటుకు 80 శాతం పరిహారాన్ని కేవలం మూడు రోజుల్లోనే ప్రభుత్వం అందించింది. ఇప్పుడు మళ్లీ కొత్త బోటును కొనుగోలు చేసుకున్నాను. ఇంత వేగంగా పరిహారం అందించిన ఏకైక ప్రభుత్వం ఇదే.

– యాగ శ్రీనివాసరావు, బోటు యజమాని

తూర్పులో బరితెగించిన టీడీపీ

• విచ్చలవిడిగా డబ్బుల పంపిణీ

ఆరిలోవ: తూర్పు నియోజకవర్గంలో టీడీపీ బరితెగించింది. ఓటమి భయంతో ఓటర్లను ప్రలోభపెడుతోంది. డబ్బులు పంపిణీ చేసి ఓట్లు కొనుగోలుకు పూనుకుంది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో టీడీపీ నాయకులు ఆరిలోవ ప్రాంతంలోని జీవీఎంసీ 10, 11, 12, 13 వార్డుల్లో ఓటర్ల ఇళ్లకు వెళ్లి డబ్బులు పంపిణీ చేశారు. ఇందిరానగర్, బి.ఎస్.ఆర్ నగర్, గాంధీనగర్, శ్రీకాంత్‌నగర్ దరి జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ, ఆరిలోవ కాలనీ, ఆపరేషన్‌కాలనీ, పాండురంగాపురంలో ఓటర్లకు డబ్బులు అందజేశారు. ఇందిరానగర్‌లో ఓటుకు రూ.1000 చొప్పున, బి.ఎస్.ఆర్ నగర్, ఆరిలోవ జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎంకాలనీ, గాంధీనగర్‌లో ఓటుకు రూ.1,500 చొప్పున పంపిణీ చేశారు. సమాచారం అందుకున్న ఎన్నికల ఫ్లైయింగ్ స్క్వాడ్ ఆయా ప్రాంతాలకు వెళ్లే సరికి టీడీపీ నాయకులు పరారయ్యారు.

భూ హక్కు చట్టంపై తప్పుడు ప్రచారం

- రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ
- కె.కె.రాజుకు మద్దతు తెలిపిన బిల్డర్స్ అండ్ కాంట్రాక్టర్స్



మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స, చిత్రంలో కె.కె.రాజు

మద్రిపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చే వారే కానీ లాక్కునే వారు కాదని.. భూ హక్కు చట్టంపై అపోహలు వద్దని రాష్ట్ర విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ అన్నారు. బిర్లా జంక్షన్‌లోని బొత్స స్క్వేర్‌లో వైఎస్సార్ సీపీ నాయకుడు జి.వి.రవిరాజు ఆధ్వర్యంలో ఆదివారం బిల్డర్స్ అండ్ కాంట్రాక్టర్స్‌తో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా మంత్రి బొత్స సత్యనారాయణ, వైఎస్సార్ సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా బొత్స మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ మేలు జరిగేలా ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఉంటుందన్నారు. బ్రిటిష్ కాలంలో భూ సర్వేలు జరిగాయని.. అయితే భూముల సబ్ డివిజన్ జరగలేదన్నారు. దీని వలన క్రయవిక్రయాలు చేసే సమయంలో కొన్ని ఇబ్బందులు ఉన్నాయన్నారు. వీటిని అధిగమించేందుకు ఈ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ ఉపయుక్తంగా నిలుస్తుందన్నారు. కె.కె.రాజు మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. సచివాలయ వ్యవస్థ ద్వారా గ్రామ స్వరాజ్యం సాకారం చేశారని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించారని గుర్తు చేశారు. ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్ సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఈ సందర్భంగా కె.కె.రాజుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని బిల్డర్స్ అండ్ కాంట్రాక్టర్స్ ప్రకటించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వీఎంఆర్డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి, కార్పొరేటర్ బర్కత్ అలీ, కేవీ బాబా, ఇంటక్ నాయకులు మంత్రి రాజశేఖర్, గుజ్జు వెంకటరెడ్డి, లంక భాస్కర్, చంద్రమౌళి పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశానికి హాజరైన బిల్డర్స్, కాంట్రాక్టర్లు

ఎంతైనా ఇస్తాం.. ఓటేయండి?





ఏయూ ప్రాంగణంలో ఓటర్లను ప్రలోభ పెడుతున్న టీడీపీ నాయకులు

- ఏయూలో గంటా, వెలగపూడి బ్యాచ్ హల్‌చల్
- పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ సమయంలో ప్రలోభాలు
- నగదు, యూపీఐ పేమెంట్లతో ఓటర్లకు గాలం
- ప్రచార రథాలతో ఎన్నికల ప్రవర్తన నియమావళికి తూట్లు

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట : మేడమ్.. నేను గంటా అనుచరుడిని. మీ ఓటు మా గుర్తుకే పడాలి. మర్చిపోవద్దు. ఆల్రెడీ మీ ఫోన్ నంబర్లు తీసుకున్నాం కదా.. దానికి యూపీఐ పేమెంట్ చేసేశాను. ఏదో ఉడతాభక్తిగా ఇస్తున్నాం. ఏమీ అనుకోవద్దు..

సార్.. నమస్తే.. నేను వెలగపూడి మనిషిని. మీ ఓటు మాకు వెయ్యండి. మీ నంబర్ చెప్పండి సర్.. యూపీఐ పేమెంట్ చేస్తాను. అయ్యో మీ దగ్గర యూపీఐ లేదా.. ఇది గోండి సర్.. ఈ డబ్బులు ఉంచండి. ప్లీజ్.. నమస్తే.. వెళ్లండి సర్.. వెళ్లండి.

ఇదీ ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆవరణలో ఆదివారం జరిగిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వద్ద టీడీపీ నేతల పరిస్థితి.

ఎటు వెళ్లినా ఓటమి పవనాలు వీస్తుంటే.. టీడీపీ అభ్యర్థులకు దిక్కుతోచడం లేదు. గెలుపు అవకాశాలు సన్నగిల్లుతున్న కొద్దీ.. అక్రమాలు, అడ్డగోలు పనులకు తెర తీస్తున్నారు. అడ్డదారులు తొక్కి ఎలాగైనా గెలవాలన్న దుర్బుద్ధితో ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారు. కొందరు ఉద్యోగులు వద్దని వారిస్తున్నా.. వారి వెంట పడి మరీ తాయిలాలు అందించారు.

ఏయూ కాలేజీలో ఆదివారం ఉదయం నుంచి ఓటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. పోలింగ్ కేంద్రానికి 100 మీటర్ల దూరం వరకూ ఎలాంటి ప్రచారాలు చేయకూడదని స్పష్టంగా తెలిసినా.. గంటా, వెలగపూడి అనుచరులు మాత్రం హల్‌చల్ చేశారు. ఓటర్లు వెళ్లే వైపు పెద్ద ఎత్తున గుమిగూడి తమకు ఎలాగైనా ఓటెయ్యాలంటూ ప్రాధేయ పడుతూ కనిపించారు. ఓటు వేయడానికి వచ్చిన వారిని నిలిపేస్తూ.. తమ పార్టీకి ఓటెయ్యమంటూ ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నాలు చేశారు. కొందరు ఓటర్లు.. వారి వైఖరికి విసుగు చెంది ఆగ్రహం వ్యక్తం చేస్తూ లోపలికి వెళ్లిపోయారు. మరికొందర్ని పక్కకి తీసుకెళ్లి మరీ.. వారికి బలవంతంగా తాయిలాలు ఇచ్చేందుకు ప్రయత్నించారు. ఒక వ్యక్తి ఫోన్ నంబర్ కనుక్కోవడం వెంటనే గూగుల్ పే, ఫోన్ పే చెయ్యడం మొదలు పెట్టారు. ఇదేంటని ప్రశ్నిస్తే.. మా సంతృప్తి కోసం సర్.. మీరు వెళ్లి మాకే ఓటు వెయ్యండి అని సాగనంపుతూ కనిపించారు. మరికొందరికి యూపీఐ లేకపోతే. డబ్బులు చేతిలో పెట్టి.. వారిని కాళ్లావేళ్లా పట్టుకొని బతిమాలుతూ నానా హంగామా చేశారు.

దందాల గ్యాంగ్ మొత్తం అక్కడే..

ఏయూ ప్రాంగణంలో వెలగపూడి అనుచరుడు కాళ్ల శంకర్, టీడీపీ నాయకుడు పోతన్న రెడ్డి, మాజీ కార్పొరేటర్ బొట్ట వెంకట రమణతో పాటు గంటా అనుచరులు పహారా కాశారు. ఉదయం నుంచి అక్కడే ఉంటూ వచ్చిన ప్రతి ఓటరునీ ప్రలోభాలకు గురిచేసేందుకు ప్రయత్నాలు చేశారు. ఇది చాలదన్నట్లుగా.. రెండు ప్రచార వాహనాల్ని అక్కడికి తీసుకొచ్చి నానా యాగీ చేశారు. పెద్ద పెద్ద సౌండ్స్‌తో టీడీపీ ప్రచార పాటలతో ఉద్యోగుల్ని ఇబ్బందులకు గురిచేశారు. టీడీపీకి ఓటెయ్యాలంటూ దందాల గ్యాంగ్ అక్కడ హల్ చల్ చేస్తుండటంతో పోలీసులు వచ్చి వారిని చెదరగొట్టారు. చివరకు పోలీసులు అడ్డు చెప్పడంతో ఇన్ గేట్ వద్ద ఒక వాహనం, అవుట్ గేట్ వద్ద ఒక వాహనం నిలిపి తిరిగి మైక్‌లో పాట వేస్తూ ఎన్నికల ప్రచారం చేశారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను సజావుగా జరగకుండా అడుగడుగునా ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ ఓటర్లను ఇబ్బపెట్టేలా ప్రవర్తించిన వారిపై చర్యలు తీసుకునేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం సమాయత్తమవుతోంది.

తొలి రోజు 4,288 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు



ఓటు వేస్తున్న ఉద్యోగిని

ఏయూక్యాంపస్/మహారాణిపేట: ఏయూ తెలుగు, ఇంగ్లిష్ మీడియం పాఠశాలల్లో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ తొలి రోజు ఆదివారం ప్రశాంతంగా జరిగింది. జిల్లాలో ఎన్నికల నిర్వహణలో జిల్లా ఉద్యోగులు 13,076 మంది, ఇతర జిల్లాల ఉద్యోగులు 5,389 మంది (మొత్తం 18,465) ఉన్నారు. వారికి పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కు కల్పించారు. తొలి రోజు జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు 3,152 మంది(24.1శాతం), ఇతర జిల్లాల ఉద్యోగులు 1,136 మంది(21.1శాతం) కలిపి మొత్తం 4,288 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఎన్నికల ప్రక్రియను స్వయంగా పరిశీలించారు. ఈ నెల 8వ తేదీ వరకు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ కొనసాగుతుందని చెప్పారు.

7, 8 తేదీల్లో హోం ఓటింగ్ : ఈ నెల 7, 8 తేదీల్లో హోం ఓటింగ్ కార్యక్రమం జరుగుతుందని, ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయని ఎన్నికల అధికారి మల్లికార్జున తెలిపారు. ఆ రెండు రోజుల్లో ఓటు హక్కు వినియోగించుకోలేక పోయిన వారికి 9వ తేదీన ప్రత్యేక అవకాశం కల్పిస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో 80 శాతం ఓటు హక్కును వినియోగించుకునేలా స్వీప్ కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని 1,991 పోలింగ్ కేంద్రాల్లో 502 క్లిష్టమైన కేంద్రాలను గుర్తించి, ఎక్కడా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా తగు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. అన్ని చోట్ల వెబ్ కాస్టింగ్, సూక్ష్మ పరిశీలకులు, వీడియోగ్రాఫర్లను నియమించామని తెలిపారు. సీనియర్ సిటిజన్లు, దివ్యాంగుల కోసం ఏర్పాట్లు చేశారు.



శారదా పీఠంలో ముగిసిన మహాక్రతువు



స్వామీజీతో ముచ్చటిస్తున్న ఎంపీ, వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి

పెందుర్తి: లోక కల్యాణార్థం శ్రీ శారదాపీఠంలో తలపెట్టిన ప్రత్యేక యాగాలు ఆదివారం మహా పూర్ణాహుతితో ముగిశాయి. ముందుగా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర సరస్వతి స్వామీజీ చేతుల మీదుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. స్వామీజీల ప్రత్యక్ష పర్యవేక్షణలో యాగాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణలతో పూర్ణాహుతి సమర్పించారు. ఈ సందర్భంగా స్వామీజీ అనుగ్రహ భాషణం చేస్తూ లోక కల్యాణార్థం చేపట్టిన ఈ మహా క్రతువును రుత్వికులు వేడిగాలులను సైతం తట్టుకుని, పరిపూర్ణం చేయడం సంతోషంగా ఉందన్నారు. శారదాపీఠంలోని రాజశ్యామల అమ్మవారి దేవాలయం ఎంతో ప్రసిద్ధి చెందిందని, అమ్మవారి దర్శనం ఎంతో పుణ్యఫలం అని అన్నారు. యాగంలో పాల్గొన్న వారి కుటుంబాలు సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. పూజల్లో రాజ్యసభ సభ్యుడు వై.వి సుబ్బారెడ్డి, పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్, పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఆడారి ఆనంద్, ప్రముఖులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విశాఖ రుణం తీర్చుకుంటా



బొత్స ఝూన్సీని సత్కరిస్తున్న కాపు సంఘం నేతలు, చిత్రంలో పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్ కుమార్



కళింగ వైశ్య సంఘ సభ్యులనుద్దేశించి మాట్లాడుతున్న బొత్స ఝూన్సీ

- ఇక్కడే పుట్టా .. ఇక్కడే చదువుకున్నా..
- నగరానికి సేవ చేసే అవకాశం కల్పించిన జగనన్నకు కృతజ్ఞతలు
- వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ

గోపాలపట్నం: గతంలో బొబ్బిలి, విజయనగరంలో ఎంపీ గెలిచి మెట్టినింట సేవ చేశా..ఇప్పుడు పుట్టినింట సేవ చేసే అవకాశం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కల్పించారని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ అన్నారు. ఆదివారం గోపాలపట్నం కుమారి కల్యాణమండంలో కాపు, బలిజ,తెలగ సామాజిక సంఘాలు, కళింగ వైశ్య సంఘాల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్‌తో కలిసి బొత్స ఝాన్సీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బొబ్బిలి, విజయనగరం ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంట్‌లో విశాఖ సమస్యలపై తన గళం వినిపించానని, ఎక్కడ ఉన్నా పుట్టినిల్లు రుణం తీర్చుకుంటూనే ఉన్నానని చెప్పారు. పశ్చిమ నియోజకవర్గంలోనే తాను పుట్టానని ..ఇక్కడే చదువుకున్నానని, చిన్నప్పటి నుంచి ఇక్కడ సమస్యలు, వాతావరణం పూర్తిగా తెలుసునన్నారు. విశాఖలో అన్ని నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు విజయం సాధిస్తారనడంలో ఎటువంటి సందేహం లేదన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థి ఆడారి ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ పదేళ్లుగా టీడీపీ ఎమ్మెల్యేగా ఉన్న గణబాబు నియోజకవర్గానికి ఏంచేశాడో చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్రప్రభుత్వ నిధులతో చేపట్టిన అండర్ పాస్‌వేలను తానే అభివృద్ధి చేసినట్టు బిల్డప్ ఇవ్వడం మినహా ఆయన చేసిందేమీ లేదన్నారు. గెలిచి ఇంట్లో కూర్చున్న గణబాబును ఈ ఎన్నికల్లో గట్టిగా బుద్ధిచెప్పాలని పిలుపునిచ్చారు. బెహరా భాస్కరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్, ఎన్నికల పరిశీలకురాలు పీలా ఉమారాణి, పేడాడ రమణి కుమారి, రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గుణిశెట్టి శ్రీనివాసరావు, 92వార్డు అధ్యక్షుడు అప్పలస్వామి నాయుడు, జేసీఎస్ కన్వీనర్ గేదెల మురళీకృష్ణ, కాపు,కలింగ వైశ్య సంఘం సభ్యుల పాల్గొన్నారు.



కార్యక్రమానికి హాజరైన కాపు బలిజ, తెలగ సంఘం సభ్యులు

జగన్‌ను మళ్లీ సీఎం చేద్దాం



వెలమల ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ. చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, తైనాల, చొక్కాకుల తదితర నాయకులు

- విశాఖ ఎంపీ, ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థులు బొత్స ఝాన్సీ, కె.కె.రాజు
- వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపిన వెలమలు

మద్దిపాలెం: వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ఉత్తర నియోజకవర్గంలోని వెలమ సామాజిక వర్గ పెద్దలు స్పష్టం చేశారు. బిర్లా జంక్షన్ వద్ద గల బొత్స కన్వెన్షన్ హాల్‌లో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు ఆధ్వర్యంలో ఆదివారం వెలమల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు హాజరై మాట్లాడారు. మరోసారి సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు సంపూర్ణ మద్దతు తెలపాలని బొత్స ఝాన్సీ కోరారు. సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యేగా కె.కె.రాజును, ఎంపీగా తనను గెలిపించాలని ఆమె అభ్యర్థించారు. వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి రాష్ట్రాభివృద్ధి, అన్ని వర్గాల అభ్యున్నతి కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారని కె.కె.రాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రొంగలి జగన్నాథం, జీవీఎంసీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, పార్టీ నాయకులు జి.వి.రవిరాజు, వీకేపీసీపీఐఆర్ మాజీ చైర్‌పర్సన్ చొక్కాకుల లక్ష్మి, యర్రా సన్యాసినాయుడు, పాసిల సూర్యనారాయణ, వెన్నెల సూర్యనారాయణ, పరదేశి నాయుడు, బాపునాయుడు, వెలమ సామాజిక వర్గ నాయకులు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పాటే అందరి లక్ష్యం



వైఎస్సార్‌సీపీలో చేరిన తెలుకల సంఘం నాయకులతో మాట్లాడుతున్న మంత్రి బొత్స

- మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపు
- వైఎస్సార్‌సీపీలోకి తెలుకల సంక్షేమ సంఘం ప్రతినిధులు

ఎంవీపీ కాలనీ: రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ ఆధ్వర్యంలో విశాఖ జిల్లా అఖిల గాండ్ల తెలుకల సంక్షేమ సంఘం ప్రతినిధులు 60 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఆదివారం లాసన్స్‌బే కాలనీలోని వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ కార్యాలయంలో వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజారంజక పాలనకు ఆకర్షితులమై వైఎస్సార్‌సీపీలోకి చేరినట్లు సంఘం నాయకులు వెల్లడించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్ జగన్ నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ మరోసారి అధికారంలోకి రావడమే అందరూ లక్ష్యంగా పని చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవిరెడ్డి, సంఘం నాయకులు వీరవల్లి పెదబాబు, ఎంఏఎస్ రాజు, గొట్టిపల్లి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

సంబల్‌పూర్-కాచిగూడ మధ్య స్పెషల్ రైళ్లు

తాటిచెట్లపాలెం: దువ్వాడ మీదుగా సమ్మర్ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. సంబల్‌పూర్-కాచిగూడ(08323) స్పెషల్ సంబల్‌పూర్‌లో ప్రతి సోమవారం రాత్రి 9 గంటలకు బయలుదేరి మరుసటిరోజు ఉదయం 7.20కు దువ్వాడ, రాత్రి 9.50కు కాచిగూడ చేరుకుంటుంది. కాచిగూడ-సంబల్ పూర్(08324) రైలు కాచిగూడలో ప్రతి మంగళవారం రాత్రి 11.20కు బయలుదేరి బుధవారం మధ్యాహ్నం 12.30కు దువ్వాడ, రాత్రి 11.45కు సంబల్‌పూర్ చేరుకుంటుంది.

పద్మనాభంలో టీడీపీకి భారీ షాక్

- వైఎస్సార్ సీపీలోకి తునివలసకు చెందిన 300 కుటుంబాలు
- సాదరంగా ఆహ్వానించిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు



వైఎస్సార్ సీపీలో చేరిన వారికి కండువా వేస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం : పద్మనాభం మండలంలోని తునివలస పంచాయతీ పరిధిలో టీడీపీకి భారీ షాక్ తగిలింది. అక్కడి టీడీపీ సర్పంచ్ అభ్యర్థి అల్లు అప్పలరాజు ఆధ్వర్యంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు సహకారంతో ఆదివారం సాయంత్రం భీమిలిలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వార్డు మెంబర్లు మజ్జి నాగరాజు, లచ్చుబోతు ఈశ్వరరావు, సూర్యారావుతోపాటు టీడీపీకి చెందిన 300 కుటుంబాల సభ్యులు వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన ఎంత గొప్పగా సాగిందో ప్రతి ఒక్కరూ చూడడంతోపాటు ఆయన అందించిన సంక్షేమ ఫలాలు అందరూ పొందారన్నారు. సీఎం జగన్ మళ్లీ అధికారంలోకి వస్తే ఏం చేయగలరో అది మాత్రమే చెప్పి మేనిఫెస్టోను విడుదల చేయడం చాలా గొప్ప విషయమన్నారు. అదే చంద్రబాబునాయుడు అధికారం కోసం ఆచరణ సాధ్యం కాని హామీలు ఇవ్వడంతో ప్రజలు నమ్మడం లేదన్నారు. సీఎం జగన్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే సంక్షేమ పాలన కొనసాగుతుందని అందరూ విశ్వసిస్తున్నారని... అందుకే అందరూ వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసేందుకు సిద్ధంగా వున్నారన్నారు. విశాఖ పరిపాలన రాజధాని అయితే ఎన్నో పరిశ్రమలు, కంపెనీలు రావడంతో ఎక్కువ మందికి ఉద్యోగాలు, ఉపాధి లభిస్తుందని తెలిపారు. తాను నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉండి, అన్ని సమస్యలు పరిష్కరిస్తున్నానన్నారు. టీడీపీ అభ్యర్థి గంటాను గెలిపిస్తే ఎవ్వరికీ కనిపించకుండా పోతాడని, ఈ విషయాన్ని అందరూ గుర్తించుకోవాలని కోరారు. ఫ్యాన్ గుర్తుపై ఓట్లేసి తనను ఎమ్మెల్యేగా, బొత్స ఝాన్సీలక్ష్మిని విశాఖ ఎంపీగా గెలిపించాలని కోరారు. టీడీపీ సర్పంచ్ అభ్యర్థి అల్లు అప్పలరాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పనితీరు ఎంతో నచ్చడం వల్లే తామంతా వైఎస్సార్‌సీపీలో చేరామన్నారు. ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేస్తామని వెల్లడించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, ఎంపీటీసీ సభ్యుడు కిలారి సూర్యనారాయణ, సుంకర బంగారప్పడు పాల్గొన్నారు.

తీరుమారని ఏయూ ప్రొఫెసర్

- టీడీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం
- చర్యలు తీసుకోవాలని డిమాండ్



పెదగంట్యాడలో టీడీపీ తరపున ప్రచారం చేస్తున్న ఏయూ ప్రొఫెసర్ లావణ్యదేవి

విశాఖ సిటీ: గాజువాక టీడీపీ అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు భార్య, ఏయూ ప్రొఫెసర్ లావణ్య దేవి ఎన్నికల నియమావళికి తూట్లు పొడుస్తున్నారు. టీడీపీ శ్రేణులతో కలిసి దర్జాగా ఎన్నికల ప్రచారం సాగిస్తున్నారు. ఈ ప్రొఫెసర్ తీరు చూసిన వారు అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఆమె కంప్యూటర్ సైన్స్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్నారు. నిబంధనలను పక్కన పెట్టి భర్త తరపున ఎన్నికల ప్రచారం చేసుకుపోతున్నారు. శనివారం గాజువాకలో చేపట్టిన ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై ఎన్నికల విభాగం అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినా అధికారులు పట్టించుకోకపోవడంతో ఆమె ఆదివారం కూడా యథావిధిగా టీడీపీ నాయకులతో కలిసి పెదగంట్యాడలో ప్రచారం సాగించారు.

ఎంపీ బ్యాలెట్ పత్రాలు వచ్చేశాయ్

మహారాణిపేట: ఎన్నికల నిర్వహణలో కీలకమైన బ్యాలెట్ పత్రాలు విశాఖ చేరుకున్నాయి. కర్నూలు జిల్లా ప్రభుత్వ ప్రింటింగ్ కార్యాలయంలో బ్యాలెట్లు ముద్రించారు. విశాఖ పార్లమెంట్ పరిధిలోని ఎస్.కోట(విజయనగరం జిల్లా), భీమిలి, గాజువాక, విశాఖ ఉత్తర, విశాఖ దక్షిణ, విశాఖ పశ్చిమ, విశాఖ తూర్పు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులకు ఎంపీ అభ్యర్థుల వివరాలతో కూడిన బ్యాలెట్‌లు పంపారు. ఈ పత్రాలను ఈవీఎంల్లో కమిషనింగ్ చేస్తున్నారు. ఆ ప్రక్రియ సోమవారం నాటికి పూర్తవుతుందని అధికార వర్గాలు తెలిపాయి. విశాఖ పార్లమెంట్ నియోజకవర్గంలో 33 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. వీరితో పాటు ఈవీఎంలో నోటా ఉంటుంది. మొత్తం 34 పేర్లతో రూపొందించిన బ్యాలెట్ పత్రాన్ని ఈవీఎంల్లో లోడ్ చేస్తున్నారు. రెండు ఈవీఎంలలో 16 పేర్లు చొప్పున మూడో ఈవీఎంలో రెండు పేర్లు ఉంటాయి. మొత్తం 45,350 బ్యాలెట్ పత్రాలు ముద్రించారు. వీటిలో పది శాతం రిజర్వు, ఒక పోలింగ్‌స్టేషన్‌లో టెండర్ ఓటింగ్ కోసం అదనంగా 20 బ్యాలెట్ పత్రాలు ఉంటాయి. విశాఖ ఎంపీ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 1962 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఎస్.కోట అసెంబ్లీలో 270 పోలింగ్ స్టేషన్లు,విశాఖ తూర్పు 293,విశాఖ దక్షిణంలో 237,విశాఖ ఉత్తరంలో 295,విశాఖ పశ్చిమంలో 222,గాజువాకలో 306 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి.

8 నుంచి 13 వరకు అప్పన్న ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో ఈ నెల 8 నుంచి 13వ తేదీ వరకు భగవత్ రామానుజాచార్యుల తిరునక్షత్రం పూజలను విశేషంగా నిర్వహించనున్నట్లు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ తేదీల్లో అన్ని ఆర్జిత సేవలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. ఈ నెల 8, 11, 12 తేదీల్లో రాత్రి 7గంటల వరకే స్వామివారి దర్శనాలు లభిస్తాయన్నారు. అలాగే, శ్రీవైష్ణవ శ్రీరామనవమిని పురస్కరించుకుని ఈ నెల 13న సాయంత్రం 5గంటలకు హనుమత్ వాహనంపై స్వామికి తిరువీధి జరుగుతుందని తెలియజేశారు.

రెండో రోజూ చందనం అరగదీత



చందనం అరగదీస్తున్న సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో తొలివిడత చందనం అరగదీత రెండోరోజు ఆదివారం కొనసాగింది. ఈనెల 10న చందనోత్సవం పురస్కరించుకుని ఆరోజు స్వామికి సమర్పించేందుకు కావాల్సిన మూడు మణుగుల పచ్చి చందనం(120కిలోలు)ని సమకూర్చేందుకు శనివారం అరగదీతను ప్రారంభించిన విషయం తెలిసిందే. దీనిలో భాగంగా తొలిరోజు 36 కిలోల చందనం అరగదీయగా రెండో రోజు ఆదివారం 45 కిలోల చందనం అరగదీశారు. ఆలయ వైదికులు చందనాన్ని తూకం వేసి బాండాగారంలో భద్రపరిచారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ఈవీఎంల వినియోగంపై అవగాహన తప్పనిసరి

ఏయూక్యాంపస్: సార్వత్రిక ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలతో పాటు ఇతర అధికారులు ఈవీఎంల వినియోగంపై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సూచించారు. ఎలాంటి పొరపాట్లకు తావివ్వకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఆదివారం జరిగిన పశ్చిమ నియోజకవర్గ ఈవీఎంల కమిషనింగ్ ప్రక్రియను ఆర్వో హుస్సేన్ సాహెబ్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. బ్యాలెట్ యూనిట్లు, కంట్రోల్ యూనిట్ల పనితీరు గురించి అడిగి తెలుసుకున్నారు. వీవీ ప్యాట్లు ప్రింటయ్యే విధానం, ఇతర ప్రక్రియలను పరిశీలించారు. అభ్యర్థుల పేరు, గుర్తుల అప్‌లోడింగ్ గురించి అడిగి తెలుసుకున్న ఆయన, ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది, అధికారులకు సూచనలు చేశారు. ప్రతీ అంశంపై విధుల్లో భాగస్వాములయ్యే వారంతా అవగాహన పెంచుకోవాలని, ఏమైనా సందేహాలు ఉంటే శిక్షణ సమయంలోనే నివృత్తి చేసుకోవాలని హితవు పలికారు. మొత్తం 288 ఈవీఎంలకు కమిషనింగ్ జరిగినట్లు పశ్చిమ నియోజకవర్గ ఆర్వో హుస్సేన్ సాహెబ్ తెలిపారు.

49 కేసుల్లో రూ.37,63,170 సొత్తు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న జాయింట్ పోలీస్ కమిషనర్ ఫకీరప్ప

డాబాగార్డెన్స్: కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్‌స్టేషన్లలో ఏప్రిల్‌లో నమోదైన 49 దొంగతనం కేసులను ఛేదించినట్లు జాయింట్ పోలీసు కమిషనర్ ఫకీరప్ప వెల్లడించారు. రికవరీ అయిన నగదు, ఆభరణాలు, మోటారు వాహనాల వివరాలను కమిషనరేట్‌లోని కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. 49 కేసులకు సంబంధించి 969.05 గ్రాముల బంగారం, 181 గ్రాముల వెండి, రూ.7,63,030, ఓ మోటారు సైకిల్, కారు, ఆటో, ల్యాప్‌టాప్, 14 మొబైల్ ఫోన్లు, 1 ఎంటీ గల 80 ఐరన్ పోల్స్‌ను ప్రత్యేక బృందాల ద్వారా స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీటి మొత్తం రూ.37,63,170గా పేర్కొన్నారు. నగర పరిధిలో సీసీ కెమెరాల సహకారంతో చోరీలకు పాల్పడిన దొంగలను పట్టుకున్నట్లు తెలిపారు. క్రైం విభాగానికి సంబంధించి ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, స్పెషల్ పెట్రోలింగ్‌ను అప్రమత్తం చేస్తున్నట్లు వెల్లడించారు.

స్టేషన్ల వారీగా.. మహారాణిపేట పోలీస్ స్టేషన్‌కు సంబంధించి రూ.1.10లక్షలు, టూటౌన్ రూ.3,02,800, త్రీటౌన్ రూ.3,25,000, ఫోర్త్ టౌన్ రూ.4,26,200, ఎంవీపీ రూ.1,50,770, ద్వారకా పోలీస్ స్టేషన్ రూ.30 వేలు, ఆరిలోవ రూ.3,04,400, పీఎంపాలెం రూ.2,51,750, ఆనందపురం రూ.97,200, భీమిలి రూ.7,14,000, హార్బర్ రూ.2,500, మల్కాపురం రూ.22 వేలు, న్యూపోర్ట్ రూ.13 వేలు, గాజువాక రూ.5,48,000, దువ్వాడ రూ.1,25,900, కంచరపాలెం రూ.2,15,100, ఎయిర్‌పోర్టు రూ.73 వేలు, పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధికి సంబంధించి రూ.51,500 చోరీ సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు జేసీపీ వెల్లడించారు.

'నీట్'గా పరీక్ష





తాటిచెట్లపాలెం కేంద్రీయ విద్యాలయంలో నీట్ పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు



దేశంలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యా సంస్థల్లో అండర్ గ్రాడ్యుయేషన్ మెడికల్ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన నేషనల్ ఎలిజిబుల్ కమ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) పరీక్ష ఆదివారం జిల్లాలో ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా జిల్లా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తగిన ఏర్పాట్లు చేశారు. నిమిషం ఆలస్యమైనా కేంద్రాల్లోకి అనుమతించబోమని ప్రకటించటంతో విద్యార్థులు పరీక్ష ప్రారంభానికి ముందుగానే చేరుకున్నారు. కేంద్రాల్లోకి విద్యార్థులను పూర్తి స్థాయిలో తనిఖీలు చేసిన తర్వాతే పంపించారు. ఎండల తీవ్రత దృష్ట్యా అన్ని పరీక్ష కేంద్రాల్లో తాగునీటి సదుపాయం కల్పించారు. వైద్య సిబ్బందితో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించారు. పరీక్ష ప్రశాంతంగా ముగియడంతో జిల్లా అధికార యంత్రాంగం ఊపిరి పీల్చుకుంది.

– విశాఖ విద్య

సాక్షి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME
I, YELLAI ANNAJI RAMA SARMA, S/o. Yellai Veerabhadra Laxmi Narayana Sarma, 15-111, MIG-2, H.No:63, Ratnagiri Colony, Near Lalitha Temple, P.M Palem, Visakhapatnam-530041 have changed My name from YELLAI RAMA SARMA, (Old Name) to YELLAI ANNAJI RAMA SARMA, (New Name), hence after all my documents and correspondence will continue with my new name YELLAI ANNAJI RAMA SARMA

Education
- Paramedical Science and Nursing Courses Admission open now Praveen Institute of Paramedical & sciences. Please Contact : M/s. S.R.Hospital, Near Rythu Bazar, Gopalapatnam, Vizag. Call : Mr. T.Srinivas, General Manager. Ph : 82979 52222 [V- 2507]

Real Estate

FLAT FOR SALE
- Flat for Sale 2 BHK N/F, 2nd Floor F-2, Car Parking (1000 Sft.) behind spencers Srinagar, Gajuwaka, Raviputra castle. Cont : 99485 13173, 87908 22678 [V- 786905]
- 3BHK 2200 Sft. 100 Sq.Yds. East Facing, Two Car Parkings @ KRM Colony, Seethammadhara, VSP. Price : 95 Lacs. Ph : 98484 30243 [V- 1549]

PLOT FOR SALE
- విశాఖ వార్డు పరిధిలో 6 లక్షలకే 111 చ॥ గ॥, 120 బిట్లు 133, 150, అన్ని సైజుల బిట్లు దగ్గరలో ఇల్లులు, బస్సులు, రైతుబజార్ కలవు. డైరెక్ట్ పార్టీస్. ✆ : 73864 14017 [V-786906]
- Anandhapuram దగ్గరలో వెంటనే ఇల్లు కట్టుకొనుటకు 200 చ॥గ॥ West Facing, చ॥గ॥ 9500/-, నో మీడియేటర్స్. ✆ 78937 91597, 95422 17999 [V-12034]

Services

డీలర్స్ కావలెను
- ఫుడ్ ప్రొడక్ట్ కంపెనీకి ఏరియావారీగా డీలర్స్ కావలెను. నో (No) సెక్యూరిటీ డిపాజిట్. ఫోన్ : 63007 35856 [V- 786907]

GOLD LOANS
- లోకేష్ గోల్డ్ లోన్స్ :- బ్యాంక్/ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ రేటుకు కొనబడును. సంప్ర :- 98484 88068/ 77992 23300 [V- 12047]

Wanted
- Wanted (Male / Female) Experienced Marketing Executives, part time or full time. Contact : 93465 19358 [V- 2516]
- మీరు ఉన్న చోటు నుండి డిజిటల్‌గా వర్క్ చేస్తూ ప్రముఖ గ్లోబల్ కంపెనీలో అధిక ఆదాయం సంపాదించవచ్చు. (పార్ట్ / ఫుల్ టైం) 100% ఎటువంటి ఫీజులు ఉండవు. సంప్ర : 97015 05819 [V-823787]
- Wanted Marketing Executives - 5 Nos, Office Assistants - 2 Nos (boys) for Homeloan purpose. Abhi Associates. Ph : 91331 22299 [V- 780439]
- Wanted Business Executive graduate (M/F) for well established company in Northern Andhra, good salary / incentive +4 Wheeler travel allowance. Ph : 94932 44471, 93969 72239 [V- 1976]
- సెక్యూరిటీ గార్డులు కావలెను (స్త్రీ/పురు॥) సాగర్‌నగర్ / డాబాగార్డెన్స్ & జగదాంబ ఏరియాలకు. జీతము : 12,000/- నుండి 14,000/- వరకు. సంప్ర : 96032 16460 / 81795 52684 [V- 3073]
- మీ ప్రాంతంలో పనిచేయుటకు టీచర్స్ కావలెను. ఉచిత ట్రైనింగ్ ఇవ్వబడును. ఎటువంటి రుసుము లేదు. Whatsapp. 7013518449 [G-8793]
- మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9948666206,9573633520. [M-1233978]
- బజాజ్ ఎలక్ట్రానిక్ షోరూంలో సెక్యూరిటీ గార్డ్, సెక్యూరిటీ సూపర్‌వైజర్, సెక్యూరిటీ గార్డు, Age: 25 to 50, మధురవాడ స్టోర్‌కి పనిచేయుటకు కావలెను. ✆ 9949988886, 9989139239 [T-1235463]
- త్రివేణి హోంకేర్ హైదరాబాద్‌నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 18K. Ph: 9640400073, 9160900024 [HA-100]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

సాక్షి క్లాసిఫైడ్స్ లలితానగర్, అక్కయ్యపాలెం, విశాఖపట్నం - 16.

మురళీనగర్, మాధవధార	90101 33346
NAD, కంచరపాలెం	90108 10033
గోపాలపట్నం, పెందుర్తి	70759 89701
సీతమ్మధార, ద్వారకానగర్	90100 55116
డాబాగార్డెన్స్, జగదాంబ, MVP కోలనీ, మద్దిలపాలెం	90101 96663
గాజువాక	97059 33394

విశాఖపట్నం, అనకాపల్లి + అల్లూరి జిల్లా
నాలుగు లైన్లు రూ.475/-
అదనపు లైను రూ.100/-
+ 5% జి.ఎస్.టి. అదనం

సాక్షి ఫోకస్



40వ వార్డు ఏకేసీ కాలనీలో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్

వెస్ట్.. బెస్ట్

విశాఖ పశ్చిమలో ఇవిగో అభివృద్ధి జాడలు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో మారిన రూపురేఖలు

సంక్షేమం.. అభివృద్ధి రెండింటికీ ప్రాధాన్యం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో 'విశాఖ పశ్చిమ' తన రూపురేఖలు మార్చుకుంది. ప్రజలకు సచివాలయాల ద్వారా ప్రభుత్వ సేవలు చేరువయ్యాయి. కొత్త యూపీహెచ్‌సీలతో వైద్య సేవలు చెంతకే చేరాయి. నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలు నూతన శోభను సంతరించుకున్నాయి. వీధుల్లో రహదారులు అద్దాల్లా మెరుస్తున్నాయి. బీఆర్‌టీఎస్ జిగేల్‌మంటోంది. ఎన్‌ఏడీ ఫ్లైఓవర్‌తో ట్రాఫిక్ సమస్య తీరింది. సామాజిక భవనాలు అందుబాటులోకి వచ్చాయి. పార్కులు ఆహ్లాదాన్ని పంచుతున్నాయి. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాయి. వేలాది మంది సొంతింటి కల నెరవేరింది. **ఇలా ఒకటేమిటి.. అన్ని రంగాల్లో 'పశ్చిమ' ప్రజలకు మేలు జరిగింది.**

– గోపాలపట్నం

అందరికీ ఆరోగ్యం

నియోజకవర్గంలో ఆరోగ్య సేవలు మెరుగయ్యాయి. ప్రజల చెంతకే వైద్యం చేరుకుంది. గత ప్రభుత్వ హయాంలోని ముఖ్యమంత్రి ఆరోగ్య కేంద్రాలను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం యూపీహెచ్‌సీలుగా ఆధునికీకరించింది. బుచ్చిరాజుపాలెం యూపీహెచ్‌సీని రూ.10 లక్షలతో, లక్ష్మీనగర్‌లో రూ.10 లక్షలతో, మల్కాపురంలో రూ.10 లక్షలతో, శ్రీహరిపురం యూపీహెచ్‌సీని రూ.10 లక్షలతో అభివృద్ధి చేసింది. మరో నాలుగు యూపీహెచ్‌సీలను కొత్తగా ఏర్పాటు చేసింది. కొత్తపాలెంలో రూ1.70 కోట్లతో, ఏకేసీ కాలనీలో రూ.86.80 లక్షలతో, **ములగాడలో రూ.99.98 లక్షలతో, నక్కవానిపాలెంలో రూ.98.50లక్షలతో నూతన యూపీహెచ్‌సీలను నిర్మించి** ప్రజలకు వైద్య సేవలను చేరువ చేసింది.

- **గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను రూ.5.5 కోట్లతో అభివృద్ధి చేసింది. ఇక్కడ అదనపు** భవనాలను నిర్మించింది. గతంలో ఓపీ గదిలో ముగ్గురు వైద్యులు రోగులను పరీక్షించేవారు. ఇప్పుడు ఒక్కో విభాగం వైద్యుడికి ఒక్కో గది ఉంది. నాణ్యమైన వైద్య సేవలందుతున్నాయి.
- కొత్తపాలెంలో 1.70 కోట్లతో యూపీహెచ్‌సీని నిర్మించడంతో ఈ ప్రాంత ప్రజలకు వైద్యం అందుబాటులోకి వచ్చింది. రైల్వే ట్రాక్ ఉండడం వల్ల అత్యవసర వైద్యం ఇక్కడ ప్రజలకు అందేది కాదు. ఇక్కడ ఆస్పత్రి రావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



గోపాలపట్నం కమ్యూనిటీ హెల్త్ సెంటర్

పార్కులు.. రోడ్లు.. ఇంకా..



మర్రిపాలెం వుడా లేఅవుట్‌లో నూతనంగా నిర్మించిన పార్కు

- శాంతినగర్, కరాసా పార్కులు, మర్రిపాలెం వుడా లేఅవుట్ నుంచి జిందాల్ భవన్ వరకు గ్రీన్ బెల్టుల్లో వాకింగ్ ట్రాక్‌లను అభివృద్ధి చేశారు.
- 60వ వార్డు గుల్లపాలెం వుడా కాలనీలో పార్కును హెచ్‌పీసీఎల్ సహకారంతో జీవీఎంసీ అభివృద్ధి చేసింది.
- 90వ వార్డులో పంచతత్వ పార్క్‌ను రూ.26 లక్షలతో, సీతారామరాజునగర్ పార్క్‌ను రూ.58 లక్షలతో అభివృద్ధి చేశారు.
- విమాన్‌నగర్ చిల్డ్రన్ పార్క్‌ను రూ.5 లక్షలతో ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు.
- గోపాలపట్నం బంక్ జంక్షన్ నుంచి కుమారి కల్యాణ మండపం వరకు రూ.38 లక్షలతో రహదారిని అభివృద్ధి చేశారు.
- సంజీవయ్యనగర్ నుంచి మర్రిపాలెం వుడా లేఅవుట్ వరకు 6.5 కోట్లతో రోడ్డును సుందరంగా తీర్చిదిద్దారు.
- ఎన్‌ఏడీ నుంచి గోపాలపట్నం వరకు రూ.4 కోట్లతో బీఆర్‌టీఎస్ రహదారిని నిర్మించారు.
- మల్కాపురంలో ఎన్నో ఏళ్లుగా ఉన్న గెడ్డల సమస్యను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పరిష్కరించింది. కోట్ల రూపాయలు వెచ్చించి గెడ్డలను ఆధునికీకరించింది. కొండవాలు ప్రాంతంలో మెట్ల మార్గాలను అభివృద్ధి చేసింది.
- బుచ్చిరాజుపాలెం బాజీ జంక్షన్ నుంచి గోపాలపట్నం వరకు సుమారు 3.90 కోట్లతో చేపట్టిన బీఆర్‌టీఎస్ రోడ్డు పనులు పూర్తయ్యాయి.
- జీవీఎంసీ 89వ వార్డులో 51 పనులకు రూ.5.28 కోట్లు, 90వ వార్డులో 63 పనులకు రూ12.44 కోట్లు, 91వ వార్డులో 53 పనులకు రూ.11.08 కోట్లు, 92వ వార్డులో 69 పనులకు రూ.13.82 కోట్లతో పనులు చేపట్టారు.
- గోపాలపట్నం కుమారి కల్యాణ మండపం నుంచి ఇందిరానగర్,లక్ష్మీనగర్ మీదుగా రహదారి అభివృద్ధికి రూ.7 కోట్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు ప్రారంభం కానున్నాయి.

ట్రాఫిక్ కష్టాలకు ఫ్లై ఓవర్‌తో చెక్

అత్యంత రద్దీ కూడలిగా ఉన్న ఎన్‌ఏడీలో ఫ్లైఓవర్ నిర్మాణానికి వీఎంఆర్‌డీఏ 2016 **నుంచి ప్రయత్నిస్తున్నప్పటికీ.. అప్పటి టీ**డీపీ ప్రభుత్వం సరైన సహకారం అందించలేదు. ఎన్నికలు **సమీపిస్తున్న తరుణంలో తూతూమంత్ర**ంగా 2018 చివర్లో పనులు ప్రారంభించింది. కానీ ఎన్నికల **ముందు నాటికే బిల్లులు చెల్లించకపోవడంతో** పనులు ఆగిపోయాయి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారం**లోకి వచ్చాక ఆ పనులు భుజానికెత్తుకుని రూ.150కో**ట్ల వ్యయంతో పూర్తి చేసింది. ఎన్‌ఏడీ జంక్షన్.. నగర కూడ**ళ్లలో అత్యంత రద్దీగా ఉండే** ప్రాంతం. దీని వల్ల పూర్తిగా ట్రాఫిక్ కష్టాలకు తెరపడింది.



ఎన్‌ఏడీ ఫ్లై ఓవర్

పాఠశాలలకు మహర్దశ

మేహాద్రిగెడ్డ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను రూ.73.27లక్షలతో అభివృద్ధి చేశారు. గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలను రూ.63.93 లక్షలు, గోపాలపట్నం జిల్లా పరిషత్ పాఠశాలను 84.17 లక్షలు, గాంధీగ్రామ్ పాఠశాలను రూ30.63 లక్షలు, మల్కాపురం పాఠశాలను రూ.58.96లక్షలు, ఆర్‌పీపేట పాఠశాలను రూ.67.26 లక్షలు, శ్రీహరిపురం పాఠశాలను రూ.35.79 లక్షలు, త్రినాథపురం మున్సిపల్ ప్రాథమిక పాఠశాలను రూ.21.57 లక్షలు, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాథమికోన్నత పాఠశాలను రూ.12.72 లక్షలతో ఆధునికీకరించారు. హెచ్‌సీ వెంకటాపురం ఉన్నత పాఠశాలను రూ.1.70 లక్షలతో అద్భుతంగా తీర్చిదిద్దారు. నాడు నేడు రెండో విడతలో భాగంగా మరో 14 పాఠశాల అభివృద్ధికి రూ.6.94 కోట్లతో పనులు చేపట్టారు.

- మల్కాపురం, గోపాలపట్నం బాలికల ఉన్నత పాఠశాలలను 10ప్లస్2గా ఆధునికీకరించి ఇంటర్ విద్యను అందుబాటులోకి తీసుకొచ్చారు.



హెచ్‌సీ వెంకటాపురం హైస్కూల్



గోపాలపట్నం హైస్కూల్ ప్రధాన గేటు

రూ.225 కోట్లతో 'పశ్చిమ' అభివృద్ధి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియోజకవర్గంలో రూ.225కోట్లతో అభివృద్ధి పనులు జరిగాయి. ప్రతీ వార్డులో సుమారు రూ.25 కోట్ల సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందాయి. వేలాది మందికి ఇళ్ల పట్టాలు అందించాం. టిడ్కో ఇళ్ల అందజేసి పశ్చిమ ప్రజల సొంతింటి కలను సాకారం చేశాం. ప్రభుత్వ పథకాలను ప్రజలకు అందించడంతో పాటు ఆడారి తులసీరావు ట్రస్ట్ ద్వారా నియోజకవర్గంలోని అన్ని వర్గాలకు మేలు జరిగేలా సేవా కార్యక్రమాలు చేపట్టాం. పలువురి పేదలకు సొంతంగా ఇళ్ల నిర్మింపజేశాం. సాంకేతిక సమస్యల వల్ల పింఛన్ రాని వారికి ప్రతి నెలా సొంత నిధులతో పింఛన్ అందించాం. ఇక నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సంక్షేమం కోసం కృషి చేశాను. 'పశ్చిమ'ను రాష్ట్రంలోనే మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దడం నా లక్ష్యం.

– ఆడారి ఆనంద్‌కుమార్, వైఎస్సార్ సీపీ పశ్చిమ ఎమ్మెల్యే అభ్యర్థి

ప్రజలకు దూరంగా గణబాబు

టీడీపీ ఎమ్మెల్యే పి.జి.వి.ఆర్.నాయుడు(గణబాబు) ఈ ఐదేళ్ల ప్రజలకు దూరంగా ఉన్నారు. కరోనా సమయంలో కూడా గడపదాటలేదు. ఓటేసిన ప్రజల బాగోగులను కనీసం పట్టించుకోలేదు. ఆయన చొరవతో చేపట్టిన ఒక్క అభివృద్ధి కార్యక్రమం కూడా లేదని ఆ పార్టీ నేతలు చెబుతున్నారు. గణబాబు తమకు చేసిందేమీ లేదని ప్రజలు సైతం పెదవి విరుస్తున్నారు. ఎన్నికల సమయంలో బయటకు వచ్చిన ఆయన్ని పలు చోట్ల ప్రజలు నిలదీస్తున్నారు. ఐదేళ్లు మమ్మల్ని పట్టించుకోలేదు గానీ.. ఇప్పుడు ఓట్లు కావాలా అంటూ ఇటీవల 89వ వార్డు డీఏఆర్‌నగర్‌లో పలువురు మహిళలు ఆయన్ని ప్రశ్నించారు.

కమ్యూనిటీ హాళ్లు.. కల్యాణ మండపాలు

గోపాలపట్నం పరిసర ప్రాంతాల కాపు సామాజికవర్గ ప్రజల ఆకాంక్షను వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నెరవేర్చింది. గత ప్రభుత్వంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు రూ.50 లక్షలతో జీవీఎంసీ 92వ వార్డు పద్మనాభనగర్‌లో కాపు కల్యాణ మండపం నిర్మాణానికి శంకుస్థాపన జరిగింది. అయితే పునాదుల స్థాయిలోనే ఉండిపోయింది. కాంట్రాక్టర్‌కు బిల్లులు కూడా చెల్లించలేదు. ఈ విషయాన్ని ఆడారి ఆనంద్‌కుమార్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి స్పందించిన సీఎం జగన్ రూ.2 కోట్లు మంజూరు చేయగా.. వెంటనే పనులు ప్రారంభమయ్యాయి. నాలుగు నెలల్లోనే రెండు అంతస్తులు భవన నిర్మాణం పూర్తయింది. ప్రస్తుతం తుది దశకు పనులు చేరుకున్నాయి.

- జీవీఎంసీ 89వ వార్డు ముస్లింలు 20 ఏళ్లుగా తమ సామాజిక వర్గానికి కమ్యూనిటీ హాలు కావాలని నాయకుల చుట్టూ తిరిగారు. కానీ వారి ఆకాంక్ష నెరవేరలేదు. చివరికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వారి కల నెరవేరింది. రూ.20 లక్షలతో ముస్లిం కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తయింది.
- జీవీఎంసీ 89వ వార్డు సంతోష్‌నగర్ ఏర్పడిన నాటి నుంచి కమ్యూనిటీ హాలు కావాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు. ఎవ్వరూ పట్టించుకోలేదు. ఈ ప్రభుత్వ హయాంలో రూ.20 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మాణం పూర్తి చేసుకుంది.
- 89వ వార్డులో రూ.60 లక్షలతో మూడు సామాజిక భవనాల నిర్మాణం పూర్తయింది. రూ.20 లక్షలతో మరో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.



పిలకవానిపాలెంలో నిర్మించిన సామాజిక భవనం



గ్రీన్‌బెల్ట్‌లో ఓపెన్ జిమ్



మల్కాపురం జిల్లా పరిషత్ పాఠశాలలో డిజిటల్ విద్య



వెంకటాపురంలో నిర్మించిన కాలువ



బీఆర్‌టీఎస్ రహదారి

ఫోన్ చేస్తే ఓటు వివరాలు

1950 CALL VOTER HELPLINE OF ELECTION COMMISSION OF INDIA

మహారాణిపేట: పోలింగ్ తేదీ దగ్గరపడుతోంది. ఈసారి ఓటు వేసేందుకు ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారు. ఓటర్ల జాబితాలో పేరు ఉందా? ఓటు ఏ పోలింగ్ బూత్‌లో వేయాలి? వివరాలు తెలుసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈనేపథ్యంలో వీటిని నివృత్తి చేసేందుకు కలెక్టరేట్‌లో కాల్ సెంటర్ ఏర్పాటు చేశారు. 1950 ఫోన్ చేసి ఓటరు పేరు, నియోజకవర్గ వివరాలు, కార్డు నంబర్ (ఎపిక్ నెంబర్) చెబితే పూర్తి వివరాలు అందిస్తున్నారు. అలాగే పోలింగ్ కేంద్రం, ఏ ఏరియాలో ఉందో, ఓటరు జాబితాలో క్రమ సంఖ్య తదితర వివరాలు తెలియజేస్తున్నారు.

- అలాగే 0891-2590100కు ఫోన్ చేసినా సమాచారం అందిస్తున్నారు.
- voter helpline అనే యాప్‌లోనూ కూడా వివరాలు తెలుసుకోవచ్చు.
- 1950 నంబర్‌కు eci అని టైప్ చేసి, స్పేస్ ఇచ్చి...మీ ఓటరు కార్డు (ఎపిక్) నంబర్ నమోదు చేసి సెండ్ చేస్తే కొద్ది సమయంలో మీ పేరు..బూత్ నంబర్, ఓటు సీరియల్ నంబర్ వివరాలతో సంక్షిప్త సమాచారం మెసేజ్ వస్తుంది.

మీకు తెలుసా?

చూపుడు వేలు లేకుంటే సిరాచుక్క ఎక్కడ?



సాక్షి, విశాఖపట్నం: పోలింగ్ కేంద్రాల్లో మోసాలు జరగకుండా ఉండేందుకు ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఎడమచేతి చూపుడు వేలికి చెరిగిపోని సిరా మరక పెడతారన్న సంగతి తెలిసిందే. అయితే ఓటు వేసే వ్యక్తికి ఎడమ చేతి చూపుడు వేలు లేకపోతే ఎలా అన్న ప్రశ్న తలెత్తవచ్చు. దీనికి ప్రత్యామ్నాయంగా ఎన్నికల సంఘం ఓ ఏర్పాటు చేసింది. ఎడమ చేతికి చూపుడు వేలు లేకపోతే మధ్య వేలుకు అదీ లేకుంటే చిటికెన వేలుకు అదీ కూడా లేకుంటే బొటన వేలికి సిరా మరక పెట్టాలని నిర్దేశించింది. అసలు ఎడమ చేతికి వేళ్లు పూర్తిగా లేకుంటే కుడిచేతి చూపుడు వేలుకు సిరా గుర్తు పెట్టాలని, అప్పటికీ సమస్య వస్తే వేళ్ల మధ్య, మొదళ్ల మధ్య, లేదా ఏ భాగంలోనైనా.. వేలిపైనే సిరా మరక వేయాలని సూచిస్తోంది.

సుందర తీరం.. ప్రకృతి రమణీయం



విశాఖ తూర్పు ముఖచిత్రం


ఆరిలోవ : విభిన్న భౌగోళిక, సామాజిక స్వరూపాలకు నిలయం విశాఖ తూర్పు నియోజకవర్గం. ఓ వైపు సుందర సాగర తీరం.. మరో వైపు ప్రకృతి ప్రసాదించిన తూర్పు కనుమల పచ్చని కొండల కలయికకు నిలయం ఈ నియోజకవర్గం. సహజ సిద్ధ అందాలకే కాదు సామాజిక స్వరూపంలోనూ ఇతర నియోజకవర్గాలకు అతీతం. ఎంవీపీ కాలనీ, లాసన్స్‌బే కాలనీ, దసపల్లా హిల్స్ వంటి విద్యావంతులు ఉండే ఖరీదైన తక్కువ జనసాంద్రత గల ప్రాంతాలకే కాదు.. ఆరిలోవ, పెదజాలరిపేట, మద్దిలపాలెంలలో నిరక్షరాస్యతతో కూడిన అత్యధిక జన సాంద్రతతో కూడిన పేద వర్గాల ప్రజలకు ఇది ప్రసిద్ధి. వీటితో పాటు చారిత్రాత్మక ఆంధ్ర విశ్వవిద్యాలయం, నగరంలో ప్రజాదరణ కలిగిన పోలమాంబ ఆలయం, అతిథులకు విడిదైన గవర్నర్ బంగ్లా, విశాఖ పర్యాటకంలో కీలకమైన కైలాసగిరి కొండ, జంతు ప్రదర్శనశాల ఈ నియోజకవర్గానికి మణిహారాలు.

నియోజకవర్గం స్వరూపం

ఈ నియోజకవర్గం మొత్తం జీవీఎంసీ పరిధిలో ఉంది. ఇందులో 15 వార్డులు ఉన్నాయి. 9 నుంచి 13వ వార్డు వరకు, 15 నుంచి 23వ వార్డు వరకు, 28వ వార్డు ఉన్నాయి. తూర్పున జోడుగుళ్లపాలెం, లాసన్స్‌బే కాలనీ, జాలరిపేట, పడమరన ఆర్టీసీ కాంప్లెక్స్, రామా టాకీస్ ప్రాంతం, కేఆర్ఎం కాలనీ, హెచ్‌బీ కాలనీ, దక్షిణాన అపోలో ఆస్పత్రి, జడ్జి కోర్టు, ఉత్తరాన పైనాపిల్ కాలనీ, ఆరిలోవ, డెయిరీఫారం సరిహద్దు ప్రాంతాలు.

రాజకీయ పోరు

విశాఖ తూర్పు నియోజకవర్గం 2009లో ఏర్పాటైంది. అప్పటి వరకు ఈ నియోజకవర్గ ప్రాంతాలు విశాఖ-1, పెందుర్తి నియోజకవర్గాల్లో ఉండేవి. నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎమ్మెల్యేగా టీడీపీకి చెందిన వెలగపూడి రామకృష్ణబాబు ఎన్నికవుతున్నారు. ఈయన 2009, 2014, 2019లో వరుసగా మూడు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు.



ఓటర్ల వివరాలు

మొత్తం పోలింగ్ కేంద్రాలు	282
పురుషులు	1,42,540
స్త్రీలు	1,49,646
ఇతరులు	20
మొత్తం ఓటర్లు	2,92,206

నియోజకవర్గం ప్రత్యేకతలు

- **తూర్పు నియోజకవర్గంలో నగరానికి మణిహారంగా నిలిచిన పర్యాటక ప్రాంతాలు ఆర్‌కే బీచ్, వీఎంఆర్‌డీఏ** పార్కు, కైలాసగిరి ఉన్నాయి.
- ఆర్‌కే బీచ్ నుంచి సీతకొండ వరకు సుమారు 6 కిలోమీటర్ల సముద్ర తీరం ఉంది.
- ప్రభుత్వ కార్యాలయాలకు నిలయం.
- ఆంధ్రా యూనివర్సిటీ, జిల్లా విద్యాశాఖా కార్యాలయం, ఇంటర్మీడియట్ బోర్డు రీజనల్ కార్యాలయం, ప్రభుత్వ ఇంటర్, డిగ్రీ కళాశాల(కృష్ణా కాలేజ్), ఏసీబీ జోనల్ కార్యాలయం, వాణిజ్య పన్నుల విభాగం రీజనల్ కార్యాలయం, విశాఖ కేంద్ర కారాగారం, జిల్లా మహిళా కేంద్రం, ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు భద్ర**పరిచే గోడౌన్, పశు సంవర్ధక శాఖ జిల్లా** కార్యాలయం, **పశు సంవర్ధక శాఖ రాష్ట్ర శిక్షణా సంస్థ**(స్టైల్), వీఎంఆర్‌డీఏ **కార్యాలయం, బీసీ, ఎస్సీ, గిరిజన** కార్పొరేషన్లు, **సీబీఐ, ఐసీడీఎస్ కార్యాలయాలు, జిల్లా హౌసింగ్** కార్పొరేషన్, టీటీడీ కార్యాలయం, జిల్లా ఎస్పీ కార్యాలయం, జిల్లా ఏఆర్ కార్యాలయం ఉన్నాయి.
- సుమారు 100 ఎకరాల విస్తీర్ణంలో విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(విమ్స్), మరో 100 ఎకరాలలో హెల్త్ సిటీ ఉంది. దీంట్లో కార్పొరేట్ ఆస్పత్రులు అపోలో, కేర్, పినాకిల్, క్యూ1, ఎంబీ, రెయిన్‌బో చిల్డ్రన్, తదితర ఆస్పత్రులు సేవలు అందిస్తున్నాయి.
- తాగునీటిని అందించే ముడసర్లోవ రిజర్వాయర్, ఆహ్లాదమైన ముడసర్లోవ పార్కు, ఐదు లైన్ల బీఆర్‌టీఎస్ రోడ్డు ఉన్నాయి.

2024 ఎన్నికల ముఖచిత్రం



ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ, టీడీపీ అభ్యర్థులు ప్రధాన ప్రత్యర్థులుగా బరిలో ఉన్నారు. వైఎస్సార్‌సీపీ తరఫున ఎమ్మెల్యే అభ్యర్థిగా ఎంవీవీ సత్యనారాయణ, టీడీపీ తరఫున వెలగపూడి రామకృష్ణబాబు పోటీ చేస్తున్నారు. అయితే వెలగపూడిపై స్థానికుల్లో వ్యతిరేకత ఉంది. ఐదేళ్లుగా నియోజకవర్గానికి దూరంగా ఉండడంపై మండిపడుతున్నారు. ప్రజల సంక్షేమాన్ని, నియోజకవర్గ అభివృద్ధిని వెలగపూడి గాలికి వదిలేసి సొంత ప్రాంతమైన విజయవాడ, హైదరాబాద్ వెళ్లి తన వ్యాపారాలు చక్కబెట్టుకున్నారని ప్రజలు రుసరుసలాడుతున్నారు. మరోవైపు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉంది. ఈ ఐదేళ్లలో ప్రభుత్వం అందించిన సంక్షేమ కార్యక్రమాలతో ఎస్సీలు, ఎస్టీలు, బీసీలు, ఇతర మైనారిటీ వర్గాలు వైఎస్సార్‌సీపీకి బలమైన మద్దతుదారులుగా ఉన్నారు. దీంతో ఈ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ వైపే మొగ్గు కనిపిస్తోంది.